
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
ఆదివారం 24 మార్చి 2024



ఇంటిలో విగత జీవులుగా ఉన్న తల్లి, కూతురు

వైసీపీ భూదాహానికి పేద కుటుంబం బలి

ముఖ్యమంత్రి సొంత జిల్లా.. ఒంటిమిట్ట కోదండరాముడి ఆలయానికి అల్లంతదూరంలో కడప-చెన్నై ప్రధాన రహదారి ఆనుకుని ఉన్న మాధవరంలో వైసీపీ నేతల భూదాహానికి ఓ నిరుపేద చేనేత కుటుంబం బలి అయింది. తమకున్న మూడు ఎకరాల భూమిని వైసీపీ నేతలు వారి పేరుతో ఆన్‌లైన్ చేసేసుకున్నారు. దీనికి రెవెన్యూ అధికారులు తోడ్పాటు అందించారు. ఇది అన్యాయమని ఆ భూమిని తిరిగి తమ పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కించాలని, తమకు ఇద్దరు ఆడబిడ్డలని, ఆ భూమిని అప్పగిస్తే వారిని పోషించుకుంటామని ఎంత బతిమలాడినా రెవెన్యూ అధికారులు కనికరించలేదు. దీంతో చేసేది లేక భార్య, భర్త, కుమార్తె ఆత్మహత్య చేసుకున్నారు. భార్య, కూతురు ఇంటిలో చనిపోగా భర్త సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. వారు రాసిన సూసైడ్‌నోట్‌లో తమ మరణానికి రెవెన్యూ అధికారులే కారణమని, తమలాగా ఎవ్వరూ బలికాకుండా ఇలాంటి రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని పేర్కొనడం సంచలనంగా మారింది.



ఘటనా స్థలంలో దొరికిన సూసైడ్ నోట్

- భార్య, భర్త, కుమార్తె ఆత్మహత్య
- 3 ఎకరాల భూమికి ఆన్‌లైన్‌లో పేరు మార్చుకున్న వైసీపీ నాయకుడు
- ఇదేమి అన్యాయమంటే పట్టించుకునేవారు కరువు
- ఏమీ చేయలేక కుటుంబమంతా ఆత్మహత్య
- తమ ఆత్మహత్యలకు రెవెన్యూ అధికారులే కారణం..
- ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలంటూ సూసైడ్‌నోట్



పాల సుబ్బారావు, భార్య పద్మావతి, కూతురు వినయ (ఫైల్‌ఫొటోలు)

ఒంటిమిట్ట, మార్చి 23: కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరంలో భవన్ నారాయణస్వామి గుడి సమీపంలో పాల సుబ్బారావు (47), పాల పద్మావతి (41) దంపతులు నివాసం ఉంటున్నారు. వీరి స్వస్థలం అట్లూరు మండలం ఆకుతోటపల్లి. ఆ గ్రామం సోమశిల మునకప్రాంతం కావడంతో వీరు 20 సంవత్సరాల క్రితం కొత్తమాధవరం వచ్చి స్థిరపడ్డారు. కరోనా సమయంలో సుబ్బారావు తండ్రి చలపతి చనిపోయారు. అప్పటి వరకు వీరు చేనేత పనితో జీవనం సాగించే వారు. తండ్రి మృతి అనంతరం సుబ్బారావు యాక్టింగ్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, భార్య పద్మావతి ఇంటి వద్దనే టైలరింగ్ చేసుకుంటూ, అలాగే మగ్గం నేచి జీవనం సాగించేవారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె లక్ష్మీ ప్రసన్న, రెండవ కుమార్తె వినయ (17). పెద్ద కుమార్తె హైదరాబాదులో బ్యూటీ పార్లర్ కోచింగ్ తీసుకుంటున్నారు. చిన్న కుమార్తె ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది.

శనివారం ఉదయం పాలు పోసే అతను వచ్చి చూసేప్పటికి పద్మావతి, వినయ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషయం తెలిసి ఆ ఊరిలోనే ఉన్న వారి బంధువులంతా అక్కడికి చేరుకున్నారు. కాసేపటికే ఒంటిమిట్ట సమీపంలో రైల్వేట్రాక్‌పై సుబ్బారావు మృతదేహం ఉన్న సమాచారం వెలుగులోకి వచ్చింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి సీఐ పురుషోత్తం రాజు, ఎస్ఐ మధుసూదన్‌లు చేరుకుని విచారణ చేపట్టారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ షరీఫ్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. అనంతరం క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్ ద్వారా వేలిముద్రలు సేకరించారు.

సూసైడ్ నోట్..

ఘటనా స్థలంలో ఓ సూసైడ్‌నోట్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అందులో రాసిన మేరకు.. ఒంటిమిట్ట రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 2187/2, ఖాతా నెంబరు 1712లో సుబ్బారావు తండ్రి పేరుతో మూడు ఎకరాల భూమి ఉండేది. దానిని రెవెన్యూ అధికారులు కట్టా శ్రావణి పేరుతో ఆన్‌లైన్ చేసేశారు. దీనిపై పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం చేయలేదు. సుబ్బారావు తండ్రికి అనారోగ్యం కారణంగా రూ.4లక్షలు, తమ్ముడి పెళ్లి సమయంలో రూ.3లక్షలు ఖర్చయ్యాయి. దీంతో ఆర్థిక సమమస్యలున్నాయి. తమకున్న అప్పులు తీర్చాలన్నా, పిల్లల చదువులు పెళ్లిళ్లకు ఆ భూమిని అమ్మడం తప్ప మరో మార్గం లేదు. ఆ భూమి వేరేవారి పేరుతో ఉందని తెలుసుకుని మనస్థాపం చెందారు. ఈ జీవితం తమకు అవసరం లేదని, రెవెన్యూ అధికారుల లంచాలకు మరొక కుటుంబం బలి కావద్దని సూసైడ్‌నోట్‌లో రాశారు.

నిందితులను శిక్షించాలి

ఒకే కుటుంబంలో ముగ్గురు చనిపోయారని తెలియగానే స్థానికులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్నారు. వారు మాట్లాడుతూ.. మండలంలో భూఆక్రమణలు, నకిలీ పట్టాల తయారు చేయడం పెద్ద ఎత్తున కొనసాగుతోందని, దీని ద్వారా పేద కుటుంబాలు బలవుతున్నాయని అన్నారు. ఈ ముగ్గురి చావుకు బాధ్యులైన వారిని శిక్షించాలని పోలీసులకు విన్నవించారు. దీనిపై డీఎస్పీ షరీఫ్ మాట్లాడుతూ మృతికి గల కారణాలపై విచారణ చేపడుతున్నామని, ఆత్మహత్య చేసుకున్నారా మరి ఎవరైనా చంపేశారా.. అన్న కోణంలో కూడా విచారణ చేస్తున్నామన్నారు. ముందుగా భార్య, కుమార్తెను చంపి తను ఆత్మహత్య చేసుకున్నాడా.. లేక మరి ఏం జరిగిందనే దానిపై విచారణ ప్రారంభించామన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి అనుమానాస్పద స్థితి కింద కేసు నమోదు చేశామన్నారు.

రైతు భరోసా పడుతున్నా..

కొడుకు, కోడలు, మనవరాలిని బలి తీసుకున్న వ్యక్తులను కఠినంగా శిక్షించాలని మృతుడు సుబ్బారావు తల్లి వెంకటలక్షుమ్మ కోరారు. తమకు కొద్ది సంవత్సరాలుగా రైతు భరోసా పడుతుందని ఇలాంటి భూమిని వేరే వాళ్ల దౌర్జన్యంగా ఆన్‌లైన్ చేసుకుని తమ కుటుంబానికి లేకుండా చేశారని ఎంతటి వారినైనా కఠినంగా శిక్షించాలన్నారు. ఆన్‌లైన్‌లో భూమార్పిడిపై విచారణ చేస్తున్నామని తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. తాను కొత్తగా బాధ్యతలు తీసుకున్నానని గతంలో రెవెన్యూ రికార్డులు ఏమి ఉన్నాయో, ఎవరి పేరుమీద ఉందనే దానిపై విచారణ చేపడుతున్నామన్నారు.

భూఆక్రమణలపై చర్యలు చేపట్టాలి

ఒంటిమిట్ట మండలంలో భూఆక్రమణలు పెరిగిపోయాయని, పాల సుబ్బారావు భూమిని ఆన్‌లైన్‌లో మార్చిన వ్యక్తులు, రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని కొత్త మాధవరం సర్పంచ్ పన్నెల చంద్ర డిమాండ్ చేశారు. తమ గ్రామంలో ఎప్పుడూ లేనివిధంగా తప్పుడు పత్రాలతో భూ ఆక్రమణలు పెరిగాయని ఒకరిపేరు మీద ఒకరికి భూములు మారుతున్నాయని, దీనిపై అధికారులు చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఆత్మహత్యకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని మండల టీడీపీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి కోరారు. వైసీపీ ప్రభుత్వంలో భూములు ఆక్రమణలు పెరిగిపోయాయని ఆన్‌లైన్‌లో భూ మార్పిడికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చేతులు మారిన లక్షలు..

పాల సుబ్బారావు తండ్రి చలపతి పేరుతో ఒంటిమిట్ట రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 2187/2, ఖాతా నెంబరు 1712లో 3.10 ఎకరాల భూమి ఉంది. ఇటీవల ఆ భూమి పక్కనే కడప నుంచి రేణిగుంట వరకు ఫోర్ లేన్ రోడ్డు పోతోంది. దీంతో అక్కడ భూముల ధరలు అమాంతం పెరిగిపోయాయి. చలపతి పేరుతో ఉన్న 3.10 ఎకరాలు ఇప్పుడు రూ.3 కోట్లకు పైగా పలుకుతోంది. ఈ నేపథ్యంలో ఫోర్‌లేన్ రోడ్డుకు అనుకుని ఉన్న భూములపై రాజంపేట ఎమ్మెల్యేకు ప్రధాన అనుచరుడు, మాజీ సర్పంచ్ అయిన వైసీపీ నేత కన్నుపడింది. రెవెన్యూ వారితో కుమ్మక్కై ఇక్కడ బినామీ పేర్లతో వంద ఎకరాలకు పైగా ఆన్‌లైన్ చేసుకున్నారని సమాచారం. ఈ వ్యవహారంలో రెవెన్యూ వారికి లక్షల రూపాయలు ముట్టాయని అంటున్నారు. దీంతో వారు చలపతి పేరుతో ఉన్న స్థలాన్ని కట్టా శ్రావణి పేరుతో ఆన్‌లైన్ చేసేశారు. పేదవాడైన చలపతి కుమారుడు పాల సుబ్బారావు లక్షలు ఇచ్చుకోలేకపోవడంతో రెవెన్యూ అధికారులు అతని అభ్యర్థనలను పట్టించుకోలేదు. దీంతో మనస్తాపానికి గురై ఆ కుటుంబం ఆత్మహత్య చేసుకుందని పలువురు అంటున్నారు. అయితే.. రైల్వేట్రాక్ కొత్త మాదవరం పక్కనే ఉందని.. 3 కి.మీ దూరం వెళ్లి పాల సుబ్బారావు ఎందుకు ఆత్మహత్య చేసుకుంటాడని కొందరు అంటున్నారు. పొలం కోసమే హత్య చేశారేమో అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఏదిఏమైనా.. పోలీసుల విచారణలో వాస్తవాలు తెలియాల్సి ఉంది.



తమ కుటుంబానికి అన్యాయం జరిగిందని తెలియజేస్తున్న సుబ్బారావు తల్లి సుబ్బలక్షుమ్మ

జిల్లాలో 144 సెక్షన్

- జూన్ 6వ తేదీ వరకు అమలు : కలెక్టర్

కడప(కలెక్టరేట్), మార్చి 23: కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకోసం 144 సెక్షన్ అమలు చేస్తున్నామని.. దీనికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రచారం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10గంటల వరకు మాత్రమే నిర్వహించుకోవాలని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో పటాకులు పేల్చడం నిషేధించామని పేర్కొన్నారు.

ఎన్నికలు ముగిసేంత వరకు అన్ని లైసెన్సు తుపాకులు పోలీసు స్టేషన్లు, అధీకృత డీలరువద్ద జమచేయాలని తెలిపారు. అనుమతులు లేకుండా ర్యాలీలు, బహిరంగ సభలకు లౌడ్ స్పీకర్లు, సౌండ్ యాంప్లికేషన్ సిస్టమ్‌లు ఉపయోగించ రాదని పేర్కొన్నారు. జూన్ 6వ తేదీ వరకు జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఈ ఉత్తర్వులు ఉల్లంఘిస్తే శిక్షార్హులని ఆ ప్రకటనలో హెచ్చరించారు.

ఆర్పీ సుశీల విధుల నుంచి తొలగింపు

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 23: ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన కారణంగా మెప్మాలో ఆర్పీగా పనిచేస్తున్న సుశీలను విధులనుంచి తొలగించామని కడప ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్డీవో మధుసూదన్ తెలిపారు. ఇటీవల కడప నగరంలో అధికార పార్టీ ప్రచారంలో ఆర్పీ సుశీల పాల్గొన్నట్లు ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైంది. దీనిపై విచారణ చేపట్టగా వాస్తవమని తేలడంతో సంబంధిత ఆర్పీని విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న వారు ఎన్నికల నియావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

వైసీపీ ప్రచారంలో పాల్గొన్న తాత్కాలిక ఉద్యోగి తొలగింపు

వేంపల్లె, మార్చి 23: వేంపల్లెలో వైసీపీ సిద్ధం ప్రచారంలో పాల్గొన్న ఉర్దూ జూనియర్ కళాశాల తాత్కాలిక ఉద్యోగి పీఈటీ నూర్‌అహ్మద్‌ను తొలగిస్తూ ప్రిన్సిపల్ రవి ఉత్తర్వులు జారీ చేశారు. మూడు రోజుల క్రితం ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంతో పత్రికల్లో వచ్చింది. దీనిపై తహసీల్దార్ వెంకటేశ్ నాయక్, ఎంపీడీఓ దివిజ విచారణ జరి ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్‌కు ఆదేశాలిచ్చారు. దీంతో నూర్ అహ్మద్‌ను తొలగిస్తూ ప్రిన్సిపల్ చర్యలు తీసుకున్నారు.

జిల్లాకు పార్టీ అధ్యక్షుల రాక

- 27న వైఎస్ జగన్
- 28న వైఎస్ షర్మిల
- 30న చంద్రబాబు



(కడప-ఆంధ్రజ్యోతి): కడప జిల్లాకు ఉమ్మడి స్టేట్‌లోనే ఓ ప్రత్యేకమైన పేరుంది. కక్షలు, కార్పణ్యాలకు నెలవని ఎలా ప్రసిద్ధి చెందిందో... ఉమ్మడి రాష్ట్రానికి రెండుసార్లు, విభజిత రాష్ట్రానికి ఒకసారి సీఎంలను అందివ్వడం ద్వారా గుర్తింపు తెచ్చుకుంది. అలాంటి జిల్లాలో ఈ నెల చివరి వారంలో సార్వత్రిక ఎన్నికల రాజకీయ వేడి పతాక స్థాయికి చేరుకోనుంది. దానికి కారణం రాష్ట్రంలో ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్‌కు చెందిన అధ్యక్షులు జిల్లాలో పర్యటిస్తుండడం. అది కూడా నాలుగురోజుల వ్యవధిలోనే వారి పర్యటన కావడంతో ఒక్కసారిగా రాజకీయ వేడి పెరగనుంది.

వైసీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్ బస్సు యాత్ర చేయనున్నారు. 27న ఇడుపులపాయలో దివంగత వైఎస్‌కు నివాళులర్పించి కమలాపురం మీదుగా ప్రొద్దుటూరు వెళ్లి అక్కడ తొలి బహిరంగసభ నిర్వహిస్తారు. ఇక జగన్ సోదరి వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా ఉన్నారు. ఆమె కడప పార్లమెంటు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయనున్నారని అంటున్నారు. ఇప్పటికే జిల్లా నేతలతో సమావేశమయ్యారు. ఈ నెల 28న కడపలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చే ఇఫ్తార్ విందుకు ఆమె హాజరుకానున్నారు. ఒకవేళ తేది మారిస్తే తప్ప ఆ రోజే దాదాపు ఖరారు అయ్యే అవకాశాలున్నాయి. ఇక టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ప్రజాగళం పేరుతో రాష్ట్రవ్యాప్తంగా పర్యటించనున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 30న ఉదయం మైదుకూరులో ప్రజాగళంలో పాల్గొననున్నారు. అనంతరం సాయంత్రం ప్రొద్దుటూరులో శివాలయం సెంటరులో బహిరంగసభలో పాల్గొననున్నారు. కేవలం నాలుగురోజుల వ్యవధిలోనే మూడుపార్టీల అగ్రనేతలు కడపకు రానుండడం విశేషం.

ఉపాధ్యాయుడి ఆత్మహత్య



రాజశేఖర శర్మ (ఫైల్)

ప్రొద్దుటూరు, మార్చి 23: ప్రొద్దుటూరు పట్టణం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ లాడ్జిలో కర్నూలుకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాజశేఖరశర్మ(49) చేతిని కోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూటౌన్ సీఐ అబ్దుల్ కరీం తెలిపిన వివరాల ప్రకారం.. నంద్యాల జిల్లా నొస్సంకు చెందిన రాజశేఖర శర్మ ఉద్యోగ రీత్యా కర్నూలులో స్థిరపడ్డాడు. ప్రస్తుతం గోనేగండ్ల మండలం పుట్టపాశం ప్రాథమిక పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల ఓ ఘటనకు సంబంధించి విద్యార్థులు ఆయనపై ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన అధికారులు ఈ నెల 21 ఆయనను సస్పెండ్ చేశారు. దీంతో మనస్థాపం చెంది ఇంటికి వెళ్లకుండా నేరుగా ప్రొద్దుటూరు వచ్చి లాడ్జిలో ఉంటున్నాడు. ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు శుక్రవారం కర్నూలులోని నాలుగవ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ప్రొద్దుటూరులో ఆ ఉపాధ్యాయుడు ఆత్మహత్యకు పాల్పడ్డట్లు శనివారం వెలుగులోకి వచ్చింది. సీఐ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద సూసైడ్ నోట్‌ను గుర్తించారు. తాను తప్పు చేయలేదని విద్యార్థులతో కొందరు ఉపాధ్యాయులు తప్పుడు ఫిర్యాదు చేయించారని, అధికారులు తన వివరణ కోరకుండానే సస్పెండ్ చేశారని ఆ సూసైడ్‌నోట్‌లో రాజశేఖరశర్మ రాశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ వర్క్‌షాపులో జిల్లా నేతలు

కడప, మార్చి 23(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో శనివారం ప్రజాగళం, తెలుగుదేశం పార్టీ ఎన్నికల వ్యూహంపై విజయవాడలో జరిగిన అభ్యర్థుల వర్క్‌షాప్‌లో జిల్లా నుంచి పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. అడ్డగోలుగా సంపాదించిన వైసీపీ వచ్చే ఎన్నికల్లో ఎలాంటి పనికైనా ఒడిగడుతుందని, అందరూ బూత్ స్థాయి నుంచి అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ వర్క్‌షాపులో టీడీపీజిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, పులివెందుల ఎమ్మెల్యే అభ్యర్థులు మాధవీరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, నంద్యాల వరదరాజులరెడ్డి, బీటెక్ రవి, జమ్మలమడుగు ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరి తదితరులు పాల్గొన్నారు.










తులసిరెడ్డితో వివేకా కుమార్తె, అల్లుడు భేటీ

- వివేకా హత్య, పులివెందుల రాజకీయాలపై చర్చ



వేంపల్లె, మార్చి 23: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డిని వైఎస్ వివేకా కుమార్తె నర్రెడ్డి సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి కలిశారు. కడప నుంచి పులివెందులకు వెళ్తూ వేంపల్లెలో శనివారం తులసిరెడ్డి ఇంటికి వెళ్లి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సుమారు అరగంటకు పైగా చర్చించారు. కడప పార్లమెంట్‌కు షర్మిల బరిలో ఉంటారని ప్రచారం సాగుతోంది. పులివెందుల ఎమ్మెల్యే స్థానంపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో వీరు భేటీ కావడం భేటి చర్చనీయాంశమైంది. ప్రస్తుత రాజకీయాలపై కూలంకషంగా చర్చించినట్లు తెలిసింది. పులివెందుల ఎమ్మెల్యే అభ్యర్థి ఎంపిక విషయంపై చర్చించినట్లు తెలిసింది. వివేకా హత్యకు దారితీసిన పరిస్థితుల గురించి మాట్లాడినట్లు సమాచారం. ఈ విషయంపై తులసిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ మర్యాదపూర్వకంగా కలిశారని, కొన్ని విషయాలు చర్చించామని అన్నారు.

తాగునీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్



కడప(కలెక్టరేట్), మార్చి 23: వేసవిలో తాగునీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించామని, నీటిఎద్దడిని అధిగమించేందుకు ముందస్తు ప్రణాళికలు చేపట్టామని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. శనివారం విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి ఉపాధి హామీ పనులు, కరువు మండలాల్లో వేజ్ జనరేషన్, తాగునీరు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమావేశానికి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని ఉపాధి హామీ పనులకు కూలి పెంపుతో పాటు, కూలీలకు తాగునీటి సదుపాయం కల్పిస్తున్నామన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు నీటికొరత లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం జిల్లాలో పెద్దగా నీటిఎద్దడి లేనప్పటికి, ఏప్రిల్‌లో తాగునీటి సమస్యలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రత్యేకించి కడప నగరంలో నీటి అవసరాలకు పెన్నానదిలో సరిపడా నీరు లేకపోవడంతో మైలవరం కుడికాలువ నుంచి ఆదినిమ్మాయపల్లి ఆనకట్ట ద్వారా నీరు అందించేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. దీంతో పట్టణ, రూరల్ ప్రాంతాల్లో కొంత మేర సాగునీటి అవసరాలు కూడా తీరుతాయని సీఎస్‌కు కలెక్టర్ వివరించారు.

డ్రగ్స్ మాఫియాకు కేంద్రంగా రాష్ట్రం

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 23: డ్రగ్స్ మాఫియాకు కేంద్రంగా ఆంధ్రరాష్ట్రం నిలిచిందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి శనివారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ హయాంలో పెట్టుబడుల ఆకర్షణలో మొదటిస్థానంలో ఉన్న రాష్ట్రాన్ని జగన్‌రెడ్డి గంజాయి, డ్రగ్స్ రవాణాలో మొదటి స్థానానికి చేర్చారని పేర్కొన్నారు. డ్రగ్స్ మాఫియా వల్ల యువత భవిష్యత్తు నాశనం అవుతుందని ఈ డ్రగ్స్ మాఫియాకు మూలకారణం వైసీపీ ప్రభుత్వమేనని తెలిపారు. రూ.50వేల కోట్ల విలువ చేసే 25వేల కిలోల డ్రగ్స్ కంటెయినర్లలో ఆంధ్రకు తీసుకురావడం సామాన్య విషయం కాదని తెలిపారు. విజయసాయిరెడ్డికి, వైసీపీ నేత పూర్ణచంద్రరావుకు బ్రెజిల్‌తో ఉన్న సంబంధాలు బహిర్గతం కావాలని డిమాండ్ చేశారు. ఈ కుట్రలో ప్రభుత్వ భాగస్వాముల ప్రమేయంపై నిగ్గుతేల్చాలని కోరారు. ఇప్పటికైనా ప్రజలు వాస్తవాలు తెలుసుకుని రాష్ట్ర భవిష్యత్తు మారాలంటే వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

అనంతలో కడప కార్మికులను కబళించిన మృత్యువు



ప్రమాద స్థలంలో ద్విచక్ర వాహనం, మృతదేహాలు

బుక్కరాయసముద్రం, మార్చి 23: అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండల పరిధిలోని రోటరీపురం గ్రామం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కడప జిల్లావాసులు మృతిచెందారు. పెద్దముడియం మండలం బలపనగూడురు గ్రామానికి చెందిన బండెన్న (41), యోసబ్ (35) బైక్‌పై వెళుతుండగా ఓ ప్రైవేటు బస్సు ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారని బుక్కరాయసముద్రం సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. బండెన్న, యోసబ్.. పాత భవనాల కూల్చివేత, భవన నిర్మాణ పనులు చేస్తుంటారు. అనంతపురం నగరంలోని ఓ ఇంటి నిర్మాణ పనులు చేసేందుకు ఇద్దరూ శుక్రవారం వచ్చారు. పని ముగించుకుని, శనివారం ఉదయం ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి బయలుదేరారు. మార్గ మధ్యంలో.. రోటరీపురం వద్ద ఆగి టిఫిన్ చేశారు. అనంతరం తాడిపత్రి మీదుగా వెళ్లేందుకు రాంగ్ రూట్‌లో బైకును యూ టర్న్ తీసుకునే ప్రయత్నం చేశారు. అదే సమయంలో తాడిపత్రి నుంచి అనంతపురం వైపు వస్తున్న ఓ ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాల బస్సు బైకును ఢీకొంది. దీంతో బండెన్న, యోసబ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. బండెన్నకు భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. యోసబ్‌కు భార్య కవిత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పెండ్లిమర్రి, మార్చి 23: మండలంలోని వెల్లటూరు గ్రామానికి చెందిన వెంకటకృష్ణ (60) అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటకృష్ణ ఈనెల 7వ తేదీ ఇంట్లో గొడవపడి వెళ్లిపోయాడు. భార్య అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. శనివారం వెల్లటూరు గ్రామ పొలాల్లో చెట్టుకు ఉరివేసుకొని గుర్తుతెలియని మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పరిశీలించి వెంకటకృష్ణగా గుర్తించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

చైన్ స్నాచర్ అరెస్టు



వివరాలు తెలియజేస్తున్న చిన్నచౌకు పోలీసులు

కడప (క్రైం), మార్చి 23 : కడప నగరంలోని శంకరాపురం నారాయణ జూనియర్ కాలేజీ సమీపంలో జరిగిన బంగారు గొలుసు దొంగతనం కేసులో నిందితుడిని అరెస్టు చేసి సుమారు 25 గ్రాముల బంగారు తాళిబొట్టు సరుడును స్వాధీనం చేసుకున్నట్లు కడప చిన్నచౌకు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. శనివారం తాడిపత్రి-తిరుపతి బైపాస్ రోడ్డులో నిందితుడు తిరుగుతున్నట్లు గుర్తించి డీఎస్పీ ఎండీ షరీఫ్ ఆదేశాల మేరకు చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డి, ఎస్‌ఐ రవికుమార్ తమ సిబ్బందితో దాడి చేసి సద్దాం హుసేన్ అనే నిందితుడిని అరెస్టు చేసి అతడి వద్ద ఉన్న 25 గ్రాముల బంగారు తాళిబొట్టు సరుడును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు

కడప (క్రైం), మార్చి 23 : ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా చూడాలని కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు వీడియో కాన్ఫరెన్స్‌లో సిబ్బందికి సూచించారు. శనివారం కర్నూలు రేంజ్ డీఐజీ కార్యాలయం నుంచి కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల ఎస్పీలతో పాటు డీఎస్పీలు, సీఐలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల కమిషన్ నియమనిబంధనలకు లోబడి పనిచేయాలన్నారు. ఏదైనా సంఘటనలు జరిగినప్పుడు వాస్తవాలు మీడియాకు వెల్లడించాలన్నారు. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై నిఘా పెట్టాలన్నారు. ముందస్తుగా పోలీసు అధికారులు సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించాలని సూచించారు. నేరప్రవృత్తి గల వారిని బైండోవర్ చేయాలన్నారు. పోలింగ్ డే రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘటనపై వెంటనే స్పందించి ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయాలన్నారు. చెక్‌పోస్టుల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలన్నారు. ఏదైనా పట్టుబడితే సంబంధిత ఇన్‌కమ్‌ట్యాక్స్ అధికారులకు లేదా ఇతర అధికారులకు సమాచారం అందించాలన్నారు. సీ విజిల్ యాప్‌లో ఎవరైనా ఫిర్యాదులు చేస్తే పోలీసులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి సమస్యలు లేకుండా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నాలుగు జిల్లాల నుండి కర్నూలు జిల్లా ఎస్పీ క్రిష్ణకాంత్, నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, కడప జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్, అన్నమయ్య జిల్లా ఎస్పీ క్రిష్ణారావులతో పాటు అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

తనిఖీల్లో రూ.2.94 లక్షలు స్వాధీనం

పులివెందుల టౌన్, మార్చి 23: పులివెందుల డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో రూ.2.94 లక్షలు నగద స్వాధీనం చేసుకున్నారు. శనివారం మధ్యాహ్నం చక్రాయపేట, లింగాల మండలాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించింది. ఇందులో భాగంగా డివిజన్ పరిధిలోని చక్రాయపేట మండలంలోని అద్దాలమర్రి క్రాస్ వద్ద రూ.1.97 లక్షలు, మండల కేంద్రమైన లింగాలలో రూ.97 వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదును పులివెందుల రిటర్నింగ్ అధికారి వెంకటేశులుకు అప్పగించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

మదనపల్లె అర్బన్, మార్చి 23: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన హరీశ్(23) అనే యువకుడు తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రూరల్ సీఐ శేఖర్ తెలిపారు. మదనపల్లె మండలం తట్టివారిపల్లెకు చెందిన మధు కుమారుడు హరీశ్ ఇంట్లో మందలించడంతో ఆరు రోజుల క్రితం ఎలుకల మందు తాగి ఆత్మహత్యాప్రయత్నం చేశారు. సిమ్స్‌కు తరలించగా అక్కడ మృతి చెందాడు.

మనవారైతే చాలు



- మెడికల్ కళాశాల నియామకాల్లో వైసీపీ నేతల చేతివాటం
- డిగ్రీ చదివినా.. ల్యాబ్ టెక్నీషియన్‌గా ఒకే
- బీటెక్ చదివినా.. నర్సుగా ఓకే
- ఇదీ పులివెందుల మెడికల్ కళాశాల ఉద్యోగ నియామకాల దుస్థితి

కడప, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మెడికల్ కళాశాల నియామకాల్లో వైసీపీ నేతలు చేతివాటం ప్రదర్శించారు. 180 మందికి అర్హతతో సంబంధం లేకుండా అడ్డగోలుగా నియామకాలు జరిపారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఉద్యోగాల మేళా నిర్వహించి అనర్హులకు అందలం ఎక్కించారు. నిజమైన అర్హులకు మొండిచేయి చూపించారు. పులివెందులకు ఎంపీ నిర్వహించే ప్రజాదర్బార్‌లో గాని, ఎంపీ కార్యక్రమాలలో గాని నిరుద్యోగులు తమకు ఉద్యోగాలు కావాలంటూ అర్జీలు సమర్పిస్తూ వచ్చేవారు. వీరంతా అధికారపార్టీ చోటామోటా నాయకులకు సంబంధించిన వారే కావడం విశేషం. ఇలా అర్జీలు ఇచ్చిన వారిలో పలువురికి అర్హతలతో సంబంధం లేకుండా మెడికల్ కళాశాలలో ఏర్పాటయ్యే అన్ని విభాగాలలో ఆఫీస్ అటెండర్లుగా ఉద్యోగాలు ఇచ్చేశారు. దాదాపు 180 మందికి అటెండర్ ఉద్యోగాలు ఇచ్చినట్లు చెబుతున్నారు. ఉద్యోగాలలో చేరిన వారిలో పులివెందులే కాకుండా కడప వాసులు కూడా ఉన్నారంటున్నారు. అటెండర్, సబార్డినేట్ అంటే నామోషీగా ఫీల్ అవుతారని జీడీఎస్ (జనరల్ డ్యూటీ స్టాఫ్) అని నామకరణం చేశారు. ఉద్యోగంలో చేరిన తర్వాత జీడీఎస్ అంటే అటెండర్ అనే విషయం తెలుసుకుని పలువురు తలలు పట్టుకుంటున్నారని చెబుతున్నారు.

కొందరు మానేశారు..

డిగ్రీ, బీటెక్, పీజీ చదివిన వారికి పలు విభాగాల్లో పోస్టులు ఇస్తామని చెప్పడంతో సంతోషంగా విధుల్లో చేరిన వారు.. ప్రస్తుతం ఓపీ చీటీలు, రికార్డులు రాయడం, పేషంట్లను వీల్‌చైర్‌లో తీసుకెళ్లడం, కట్లు కట్టడం, సూదులు వేయడం, రక్తసేకరణ, సంతకాలు పెట్టించడం తదితర పనులు అధికారులు అప్పగించారు. మేము చదివిన చదువులు ఏమిటి ఈ పని ఏమిటని కొందరు ఉద్యోగాలకు రాకుండా మానేసినట్లు చెబుతున్నారు. మరికొందరు వెళ్లిపోయేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

అర్హత లేకున్నా ఉద్యోగం

సాధారణంగా ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుకు ఆ కోర్సు పూర్తిచేసి ఉండాలి. అయితే మెడికల్ కళాశాల నియామకాల్లో అవేమీ లేకుండానే ల్యాబ్ టెక్నీషియన్ అటెండెంట్‌గా పోస్టు ఇచ్చేశారు. రక్తపరీక్షల్లో ఏబీసీడీలు రాని వారికి కూడా ల్యాబ్ అటెండెంట్ పోస్టు ఇచ్చారు. మెడికల్ కళాశాల ప్రారంభమయ్యేందుకు ఇంకా టైం ఉంది కాబట్టి ప్రస్తుతం వీరంతా పులివెందుల ఏరియా ఆసుపత్రిలో పలు విభాగాల్లో అసిస్టెంట్లుగా ఉంటున్నట్లు చెబుతున్నారు. ఈ పోస్టులో చేరిన వారిలో డిగ్రీ, బీటెక్, పీజీ చదివిన వారు కూడా ఉన్నట్లు చెబుతారు.

ఎన్నికల కోసమేనా.?

ఉద్యోగాల హడావుడి చూస్తుంటే ఇదంతా ఎన్నికల స్టంట్ అన్నట్లుగా కనిపిస్తోందని పలువురు చెబుతున్నారు. మెడికల్ కళాశాల, జీజీహెచ్ ప్రారంభం కాకముందే ఇంటర్వ్యూలు నిర్వహించడం, కాల్ లెటర్లు ఇవ్వడం, ఐడీ కార్డులు ఇవ్వడం చకచకా చేసేశారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ఓట్లు దండుకోవడానికి ఇష్టానుసారం ఉద్యోగాలు ఇచ్చిపడేసినట్లు చెబుతున్నారు. వైసీపీ కార్యాలయం నుంచి ముందు లిస్టు తయారు చేసి పంపించి గుట్టుగా ఉద్యోగాలు ఇచ్చి అనంతరం నోటిఫికేషన్ విడుదల చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే నోటిఫికేషన్ కూడా బయటకు రానట్లు సమాచారం.

వారంతా వీఐపీలు

రెకమెండేషన్ కావడంతో ఉద్యోగాలు పొందిన వారు ఏరియా ఆసుపత్రిలో పలు విభాగాలకు పంపించి పనులు చేయాలని అధికారులు సూచిస్తున్నారని అంటున్నారు. వీరిలో కొందరు అధికారుల మాట వినడం లేదని వాపోతున్నారు. వారంతా వీఐపీలు, వారికి పనిచెబితే వైసీపీ నాయకులు వస్తారంటూ పనులు చెప్పడం మానేసినట్లు కొందరు చెబుతున్నారు.

నిరుద్యోగులలో నిరాశ

అర్హత ఉన్న వారికి కాకుండా తమ అనుచరులు ఎవరు చెబితే వారికి ఉద్యోగం కల్పించడంపై పలువురు నిరుద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్యోగాలు ఫలానా చోట ఉన్నాయని తెలుసుకుని నిరుద్యోగులు వెళ్లి అర్జీలు ఇస్తుంటారని చెబుతారు. అయితే వారికి కాకుండా తమకు అనుకూలంగా, దగ్గరగా ఉన్న వారికి ఆ ఉద్యోగాలు ఇచ్చినట్లు పలువురు నిరుద్యోగులు చెబుతున్నారు. ఇలా ఒకటి రెండుసార్లు వెళ్లి ఇక లాభం లేదని స్వయం ఉపాధిలో కొందరు, పలువురు ఇతర రాష్ట్రాలకు వెళ్లినట్లు సమాచారం. కేవలం వారి అనుచరులకు మాత్రమే అనర్హులైనా అందలం ఎక్కించడంతో నిరుద్యోగులు మండిపడుతున్నారు. ఈ ఉద్యోగాల మేళా గుట్టుచప్పుడు కాకుండా సాగడంతో నిరుద్యోగులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా వైవీయూ వ్యవస్థాపక దినోత్సవం

కడప (ఎడ్యుకేషన్), మార్చి 23: వైవీయూ 18వ వ్యవస్థాపక దినోత్సవం, కళాశాల ఉత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యూఢిల్లీ ఎస్‌ఆర్‌ఎఫ్ ఫౌండేషన్ డైరెక్టరు డాక్టర్ వై.సురేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయాల నుంచి కేవలం సర్టిఫికెట్ తీసుకుని సమాజంలోకి వెళితే ఎలాంటి ప్రయోజనం లభించదన్నారు. వాటితో పాటు సబ్జెక్టులపై లోతైన అవగాహన, నైపుణ్యత తీసుకెళ్లినప్పుడు అవకాశాలు మీ ముంగిట వాలుతాయన్నారు. ఏ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చామన్నది ముఖ్యం కాదని, మనకున్న వనరులను ఎలా సద్వినియోగం చేసుకున్నామన్నది ముఖ్యమన్నారు. చిత్తూరు జిల్లా మారుమూల గ్రామంలో పుట్టి ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు ప్రభుత్వ విద్యాసంస్థల్లో తెలుగు మాధ్యమంలో చదివిన తాను ఏడాదికి కోటి రూపాయల వేతనం పొందే స్థాయికి చేరుకున్నానంటే నిరంతరం శ్రమించడం వల్లనే సాధ్యమైందన్నారు. ప్రతి ఒక్కరి చేతుల్లో మొబైల్ ఫోను ఉందని, తద్వారా ఆన్‌లైన్ కోర్సులు, ఇంటర్న్‌షిప్‌లు చేసి మనతో పోటీ పడేవారితో భిన్నంగా కనిపించాలన్నారు. వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్ మాట్లాడుతూ కష్టాలున్నాయని ఆగిపోతే ప్రగతి ఉండదన్నారు. కోర్సు పూర్తి చేసుకుని వెళుతున్న విద్యార్థుల విజయాలు మీ తరువాత తరానికి పాఠాలు కావాలన్నారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం 2020 మొట్టమొదట అమల్లోకి తెచ్చిన రాష్ట్రం ఏపీగా గుర్తుచేశారు. 18 ఏళ్లలోనే వందేళ్ల కిందట ఏర్పాటు చేసిన విశ్వవిద్యాలయాలతో వైవీయూ పోటీ పడుతోంద న్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి విశ్వవిద్యాలయ ప్రగతి నివేదిక సమర్పించారు. రిజిస్ట్రార్ వైపీ వెంకటసుబ్బయ్య, డాక్టర్ వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు, సైన్స్ డీన్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, అకడమిక్ డీన్ దాము తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.





వైవీయూ వ్యవస్థాపక దినోత్సవంలో మాట్లాడుతున్న ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి, శాస్త్రీయ నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఎన్నికల నియమావళి ప్రతి ఒక్కరూ పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్

రాయచోటి(కలెక్టరేట్), మార్చి 23: జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ ఎంసీసీ నిబంధనలు తప్పక పాటించాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే సాధారణ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎంసీసీ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవన్నారు. ఎన్నికలకు సంబంధించి ఏ పని చేయాలన్నా తప్పకుండా పర్మిషన్ ఉండాలన్నారు. కుల, మత, ప్రాంతీయపరమైన విద్వేషాలు చేయడం, రెచ్చగొట్టేలా రాజకీయ నేతలు ప్రవర్తించడం, మసీదులు, చర్చిలు, దేవాలయాలు, ఇతర ప్రార్థనా స్థలాల్లో ఎన్నికల ప్రచారం చేయడం, అనుమతి లేకుండా బ్యానర్లు కట్టడం, లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేయడం, డబ్బులు పంపిణీ చేయడం, గోడలపై నినాదాలు రాయడం, పోస్టర్లు అతికించడం వంటివి నిషిద్ధమన్నారు. ఎన్నికల కమిషన్ ఎప్పటికప్పుడు జారీ చేసే నిబంధనలను అవగాహన చేసుకుని నిర్దేశిత సమయంలోనే పనులు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా ఎంసీసీ అతిక్రమించినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంగన్వాడీ వర్కర్లు, ఆశావర్కర్లు ఆర్పీలు, వలంటీర్లు, రాజకీయ పార్టీల నాయకుల వెంట ర్యాలీలో, ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనకుండా చూడాలని, ఎవరైనా పాల్గొంటే వారిని వెంటనే సస్పెండ్ చేస్తామని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌వో సత్యనారాయణ, ఆర్‌వోలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పేరుతో శ్రీకాంత్‌రెడ్డి ఖాతాలోకి రూ.కోట్లు

మీడియా సమావేశంలో మున్సిపల్ కోఆప్షన్ మాజీ సభ్యుడు సల్లావుద్దీన్, ఎంహెచ్‌పీఎస్ నాయకుడు సగీర్ ఆరోపణ



సమావేశంలో మాట్లాడుతున్న సల్లావుద్దీన్, సగీర్

రాయచోటిటౌన్, మార్చి 23: రాయచోటిలో అభివృద్ధి పేరుతో కోట్ల రూపాయలు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఖాతాలోకి వెళ్లాయని రాయచోటి మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యుడు సల్లావుద్దీన్, మైనార్టీ హక్కుల పోరాట సమితి నాయకుడు సగీర్‌లు ఆరోపించారు. శనివారం వారు రాయచోటి టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల కోసమే తెలుగుదేశం పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకుందని, బీజేపీ పొత్తు ఉంటేనే కేంద్రం రాష్ట్రానికి ఎక్కువ నిధులు ఇచ్చి సహకారం అందిస్తారన్నారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆర్‌ఎస్‌ఎస్‌తో పొత్తుపెట్టుకున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. శ్రీకాంత్‌రెడ్డికి ఓట్లు వేస్తే హిందూ, ముస్లింలు ఘర్షణలు పడి రాయచోటి నియోజకవర్గం వల్లకాడయ్యే పరిస్థితి ఉందని ఆరోపించారు. చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాడని ఓట్లు వేయడానికి ముస్లిం మైనార్టీలతో పాటు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సునీత, షర్మిల జగన్‌కు ఓటు వేయవద్దని ముక్తకంఠంతో చెబుతున్నారన్నారు. చంద్రబాబు హయాంలోనే రాయచోటిలో షాదీఖానా, ఈద్గాలను నిర్మించారన్నారు. ముస్లిం మైనార్టీలు తప్పకుండా టీడీపీకే ఓటు వేయాలన్నారు. ముస్లిం మైనార్టీలను మభ్యపెట్టి అబద్దాలు చెప్పి శ్రీకాంత్‌రెడ్డి మోసం చేస్తున్నాడని ఆరోపించారు. రాయచోటిలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారా రాష్ట్రంలో చంద్రబాబును సీఎంగా చేసుకుంటామని తెలిపారు.

రాచమల్లు రాజరికాన్ని అంతం చేస్తాం

- రాచమల్లుకు టికెట్టు ఇవ్వద్దని చెప్పినా ఇచ్చారు.
- వైఎస్ మీద ఉన్న అభిమానం రాచమల్లు వల్ల నశించింది
- మేము తీసుకునే నిర్ణయానికి ప్రజా ఆశీస్సులు కావాలని విజ్ఞప్తి



ఐక్యత చాటుతున్న వైసీపీ అసమ్మతి నేతలు

ప్రొద్దుటూరు, మార్చి 23 : ప్రొద్దుటూరులో ప్రజా వ్యతిరేకిగా ముద్రపడ్డ రాచమల్లుకు టికెట్టు ఇవ్వద్దని చెప్పినా అధిష్టానం పెడచెవిన పెట్టి అతనికే టికెట్టు ఇచ్చిందని అందువల్లే రాచమల్లు రాజరికాన్ని అంతం చేయడానికి వైసీపీ అసమ్మతి వాదులమంతా ఏకమై నడుం బిగించామని జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, వంగనూరు మురళీధర్‌రెడ్డి, ఇర్ఫాన్‌బాషా తెలిపారు. శనివారం స్థానిక కొత్రపాడు రోడ్డులోని శివచంద్రారెడ్డి ఆయిల్‌మిల్లులో వైసీపీ అసమ్మతి నేతల ఆత్మీయ సమావేశం కొనిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శివచంద్రారెడ్డి మాట్లాడుతూ రాచమల్లు ప్రసాద్‌రెడ్డి చర్యల వల్ల ప్రొద్దుటూరులో వైఎస్ కుటుంబం పట్ల ఉన్న అభిమానం చెదిరిపోయిందన్నారు. రాచమల్లు ప్రసాద్‌రెడ్డి పార్టీలో సెకండరీ లీడర్‌షిప్ లేకుండా అణగదొక్కాడన్నారు. కేవలం ప్రొద్దుటూరులో వైసీపీని రాచమల్లు కుటుంబ పార్టీగా మార్చాడన్నారు. అధికారం వచ్చాక రాచమల్లు ప్రొద్దుటూరులో భూదందాలు, ఇసుక దోపిడీ, క్రికెట్ మట్కా పేకాటలను ప్రోత్సహించి వందల కోట్ల అవినీతికి పాల్పడ్డారన్నారు. ఇది మేము చెప్పేది కాదని ప్రొద్దుటూరులో టీ అంగళ్ల దగ్గర నుంచి బంగారు అంగళ్ల వరకు చర్చ జరుగుతోందన్నారు. ఎమ్మెల్యే అనుచరులు తమకు అడ్డంగా ఉన్న వారిని ఎందరిని చంపారో ప్రభుత్వం విచారణ జరిపితే బయటపడుతుందన్నారు. అందువల్లే తామంతా ఆ పార్టీలో వుండాలా లేదా త్వరలో నిర్ణయించుకుంటామన్నారు. వంగనూరు మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ పదేళ్లుగా వైసీపీ కోసం అహర్నిశలు శ్రమించినా కేసులు పెట్టించుకుని జైళ్లకు వెళ్లినా ప్రభుత్వం వస్తే మేలు జరుగుతుందని భావించామన్నారు. కానీ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం వస్తే ఇక్కడ రాచమల్లు, బంగారురెడ్డి, కిరణ్‌రెడ్డిల (ఆర్‌బీకే) ప్రభుత్వం వచ్చిందన్నారు. రాచమల్లు ఆయన సోదరుడు, బావమరిదికి తప్ప ఇక్కడ వైసీపీకి చెందిన ఎవ్వరికి ఏ అధికారం, గౌరవం లేదన్నారు. ఐదేళ్లలో సొంత పార్టీలోని మమ్మల్నే అనేక విధాలుగా వేధించి అవమానపరిచి దాడులు, కేసులు సైతం పెట్టించడానికి వెనుకాడని దుర్మార్గులు ఆ ముగ్గురూ అని విమర్శించారు. అందువల్లే వైసీపీ టికెట్టు ప్రొద్దుటూరులో రాచమల్లుకు తప్ప బీసీలలో ముందుకు వచ్చే వారికి గానీ మైనారిటీలకు గానీ శివచంద్రారెడ్డికి గానీ ఇవ్వమని కోరామన్నారు. కానీ మా గోడు పార్టీ అధిష్టానం సజ్జల ధనుంజయరెడ్డి, అవినాశ్‌రెడ్డిలు ఎవ్వరూ పట్టించుకోకుండా రాచమల్లుకు మద్దతు ఇచ్చారన్నారు. అందువల్లే ఇంక ఆ పార్టీలో ఉండదల్చుకోలేదన్నారు. త్వరలో తామంతా కలిసి ప్రొద్దుటూరును అన్ని విధాలా కాపాడే అభివృద్ధి చేయగల నాయకుడి నాయకత్వంలో పనిచేయడానికి నిర్ణయం తీసుకుంటామన్నారు. మా నిర్ణయానికి మీ ఆశీర్వాదాలు కావాలని కోరారు. ఇందుకు ఆత్మీయ సభకు వచ్చిన వారంతా చేతులు ఎత్తి మద్దతు తెలిపారు. ఆత్మీయ సభకు వెయ్యిమందికి పైగా కార్యకర్తలు, అభిమానులు వచ్చారు. సమావేశంలో పొట్టు లక్ష్మీరెడ్డి, బద్వేలు శ్రీనివాసులరెడ్డి, చిలకల క్రిష్ణారెడ్డి, రఘునాథరెడ్డి, మానసపల్లె నాగేశ్వరరెడ్డి, కొనిరెడ్డి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాధవీరెడ్డిపై వైసీపీ గూండాల దాడి దుర్మార్గం: టీడీపీ



విలేకరులతో మాట్లాడుతున్న హరిప్రసాద్

కడప (ఎడ్యుకేషన్), మార్చి 23: గన్నవరంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డిపై వైసీపీ గుండాల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ పేర్కొన్నారు. శనివారం కడప నగరం హరిటవర్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్ ముఖ్యమంత్రి అయ్యాకే గంజాయి విచ్చలవిడిగా వాడుతున్నారన్నారు. విజయసాయిరెడ్డి కనుసన్నల్లో గంజాయి మాఫియా కొనసాగుతోందన్నారు. వైజాగ్‌లో గిరిజనులతో గంజాయి పంటలను వైసీపీ నాయకులు పండిస్తున్నారని ఆరోపించారు. పోరుమామిళ్లలో వైసీపీ మట్టి మాఫియా పేట్రేగిపోతుందన్నారు. మాధవరంలో వైసీపీ నాయకుల అండదండలతో సామాన్య కుటుంబానికి సంబంధించిన భూమిని కబ్జా చేశారని దానిని తట్టుకోలేక ఆ కుటుంబమంతా ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆరోపించారు. అభంశుభం తెలియని గిరిజనులు వైసీపీ నాయకుల కుట్ర వల్ల జైలుపాలవుతున్నారన్నారు. గంజాయితో సంబంధం ఉన్న వైసీపీ నాయకులను అరెస్టు చేసి జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం రావాలన్నారు. ప్రజలు వైసీపీని గద్దెదింపేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోతుగంటి పీరయ్య, యాటగిరి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాధవీరెడ్డిపై జరిగిన దాడి అమానుషం

విజయవాడ గన్నవరం నియోజకవర్గంలో టీడీపీ కడప అభ్యర్థి మాధవీరెడ్డిపై జరిగిన దాడి అమానుషమని టీడీపీ నేతలు యాటగిరి రాంప్రసాద్, పోతుగంటి పీరయ్య, వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. శనివారం కడప నగరం హరిటవర్స్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ జగన్‌రెడ్డి ఐదు సంవత్సరాల పాలనలో చట్టాలను, న్యాయ వ్యవస్థలను రాజ్యాంగాన్ని ఎలాగు అమలు చేయలేదని, కనీసం ఎన్నికల కోడ్ అమలులో ఉందన్న భయం కూడా లేకుండా మాధవీరెడ్డిపై ప్రవర్తించిన తీరు అమానుషమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే వెంటనే ఎన్నికల అధికారులు ఈ విషయం పరిగణనలోకి తీసుకుని దాడికి పాల్పడ్డ వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మాధవీరెడ్డిపై దాడి పిరికిపంద చర్య

కడప టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డిపై దాడికి పాల్పడ్డం పిరికిపంద చర్య అని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిలానీబాషా తెలిపారు. శనివారం కడప నగరం టీడీపీ జిల్లా అధ్యక్షుడి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాధవీరెడ్డిపై దాడికి పాల్పడిన గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరుల పిరికిపంద చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు ఖాజాపీర్, ఆరిఫ్, మహ్మద్‌బాషా, ఫిరోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

'మాధవీపై దాడి అమానుషం'

కడప (నాగరాజుపేట), మార్చి 23 : ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అయిన మాధవీపై వంశీ అతని అనుచరులు దాడి చేయడం దుర్మార్గమని గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి వేదిక రాష్ట్ర కన్వీనరు కారు ఆంజనేయులు, రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెంటనే దాడి చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నూతన సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరణ



మల్లీశ్వరికి శుభాకాంక్షలు తెలుపుతున్న విఘ్నేశ్వరరావు

పులివెందుల రూరల్, మార్చి 23: పులివెందుల ఏరియా ఆసుపత్రి నూతన సూపరింటెండెంట్‌గా డి.మల్లీశ్వరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర మెడికల్ కాలేజ్‌లో పీడియాట్రిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేస్తుండేవారు. ఇక్కడి సూపరింటెండెంట్ విఘ్నేశ్వరరావు ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన సూపరింటెండెంట్ మల్లీశ్వరికి అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

దళిత డిక్లరేషన్లు మేనిఫెస్టోలో పెట్టాలి: డీహెచ్‌పీఎస్

కడప (ఎడ్యుకేషన్), మార్చి 23: అన్ని రాజకీయ పార్టీలు దళిత డిక్లరేషన్‌ను మేనిఫెస్టోలో పెట్టాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇమ్మానుయేల్, కానగల మునెయ్య డిమాండ్ చేశారు. శనివారం డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పార్లమెంటు ఎన్నికలు నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో దళితుల సామాజిక, ఆర్థిక సంక్షేమం కోసం డీహెచ్‌పీఎస్ రాష్ట్ర సమితి దళిత డిక్లరేషన్‌లు రూపొందించి ప్రకటించారన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ నాయకులు నాగేశ్వర్‌రావు, గిరిజన జిల్లా నాయకులు శంకర్‌నాయక్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీనర్శింహ గాయత్రి హోమం



పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

వల్లూరు, మార్చి 23 :మాచిరెడ్డిపల్లె గ్రామంలో జరుగుతున్న లక్ష్మీనరసింహస్వామి 28వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం గాయత్రి హోమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో పుత్తా నరసింహారెడ్డి, ధర్మపత్ని సరళమ్మ, కుమారుడు క్రిష్ణచైతన్యరెడ్డి, భార్య చైతన్య పుత్తా సోదరుడు రామచంద్రరెడ్డి భార్య వెంకటసుబ్బమ్మ భక్తులు పాల్గొన్నారు. అలాగే నేడు రాత్రి 9గంటలకు తాళభజన పోటీలు ఉంటాయని, ఉదయం 9గంలకు ట్రాక్టరు ట్రాలీ రివర్స్ పోటీలు నిర్వహిస్తామని పోటీల్లో పాల్గొనేవారు దేవస్థానం వద్ద పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

చెట్లు, లైట్లు ధ్వంసం చేసిన ఆగంతకుడు



బోలేవార్డులో ధ్వంసమైన లైట్లను పరిశీలిస్తున్న అధికారులు

పులివెందుల టౌన్, మార్చి 23: మున్సిపాలిటీలోని సెంట్రల్ బోలేవార్డులో శుక్రవారం రాత్రి ఓ ఆగంతకుడు బొల్లార్డ్ లైట్స్‌ని పగలగొట్టి, అక్కడ ఏర్పాటుచేసిన మొక్కలను పెకలించాడు. ఈ ఘటనపై శనివారం ఉదయం కమిషనర్ రమణారెడ్డి, సీఐ శంకర్‌రెడ్డి పరిశీలించి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్, సీఐ మాట్లాడుతూ ప్రతి షాపు యజమానులు సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచిస్తూ పోలీసు వారు కూడా ఈ విషయంలో షాపు యజమానులకు తెలియజేశారు. అక్కడి షాపుల ముందు ఏర్పాటు చేసిన లైట్లు, బెంచీలు, మొక్కలను ఎవరు పాడు చేయకుండా చూసుకోవాలని కోరారు. ధ్వంసం చేసిన ఆగంతకుడిని పట్టుకొని చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. టీపీఓ, ఎంఈఈ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

టీడీపీ వర్క్‌షాపులో వికాస్ హరిక్రిష్ణ



వర్క్‌షాపులో పాల్గొన్న వికాస్ హరిక్రిష్ణ

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 23 : విజయవాడలో శనివారం టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు నేతృత్వంలో జరిగిన ఎన్నికల వ్యూహం వర్క్‌షాపులో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఉదయగిరి అబ్జర్వర్ వికాస్ హరిక్రిష్ణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలు పాటించండి

కడప (మారుతీనగర్), మార్చి 23: క్షయవ్యాధి బారిన పడకుండా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా లెప్రసీ ఎయిడ్స్ టీబీ కంట్రోలింగ్ అధికారి ఎస్. రవిబాబు సూచించారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ క్షయవ్యాధి (టీబీ దినోత్సవం) సందర్భంగా ఔను మనం క్షయవ్యాధిని అంతం చేయగలం అనే నినాదంతో ఈనెల 24న నగర మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు నగర పురవీధుల గుండా ర్యాలీ జరుగనుందన్నారు. 11 గంటలకు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ప్రత్యేక సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్షయవ్యాధి నివారణ కేంద్రం కడప అర్బన్ సూపర్‌వైజర్ సుబ్బరాయుడు, జిల్లా సమన్వయ కర్తలు రాహుల్, ప్రవీణ్‌కుమార్, శ్రీధర్ పాల్గొన్నారు.

మైనార్టీ విద్యార్థులకు నేరుగా అడ్మిషన్లు

వేంపల్లె, మార్చి 23: మైనార్టీ బాలురకు కడప రామాంజనేయపురం, మైనార్టీ బాలికలు వేంపల్లెలోని మైనారిటీ పాఠశాలలో నేరుగా అడ్మిషన్ పొందవచ్చునని వేంపల్లె ప్రిన్సిపాల్ సుగుణమ్మ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ గురుకుల పాఠశాలలో ఐదు నుంచి ఎనిమిదో తరగతి వరకు చేరడానికి ఆన్‌లైన్‌లో అప్లై చేసుకునేందుకు ఈనెలాఖరు వరకు అవకాశం ఉందన్నారు.

హైస్కూలు ప్లస్‌లో ఖాళీలు భర్తీచేయాలి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 23 : కో ఎడ్యుకేషన్ కింద మంజూరైన హైస్కూలు ప్లస్ కళాశాలల్లో గల ఖాళీలను ఎన్నికల కమిషనర్ అనుమతితో వెంటనే భర్తీ చేయాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్‌సెక్రటరీలు సీవీ ప్రసాద్, చెంగలరెడ్డి, ఈశ్వర్‌చంద్ర, ఆలీఖాన్ డిమాండ్ చేశారు. విద్యాసంవత్సరం సమీపిస్తున్నందున ముందస్తుగా కార్యక్రమాన్ని ప్రారంభిస్తే విద్యాసంవత్సరం ప్రారంభంలో హైస్కూలులో బోధన సిబ్బంది కొరత నివారించవచ్చన్నారు.

అశ్లీల సాహిత్యం ప్రమాదకరం

కడప (ఎడ్యుకేషన్), మార్చి 23 : అశ్లీల సాహిత్యం యువతను తప్పుదారి పట్టిస్తుందని, జ్ఞాన శూన్యులుగా మారుస్తుందని, ఈ ధోరణి సమాజానికి ప్రమాదకరని అభ్యుదయ జిల్లాల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి అన్నారు. అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో సీపీ బ్రౌన్‌బాషా పరిశోధన కేంద్రంలో ఈదర గోపిచంద్ రచించిన కామోత్సవ దహనం, తేనేటీగ కాదిది విషపు తేలు అనే పుస్తకాల ఆవిష్కరణ సభ శనివారం సాయంత్రం నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన ఆచార్య ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ యువతలో పేట్రేగుతున్న అసాంఘిక ధోరణులకు ఇది ఆజ్యం పోస్తుందని, నైతిక విలువను నాశనం చేయడానికి ఇది ప్రేరేపిస్తుందని వివరించారు. అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్రగౌరవ అధ్యక్షురాలు డాక్టర్ సంజీవమ్మ పుస్తక సమీక్ష చేశారు. పుస్తక రచయిత అశ్లీలతా ప్రతిఘటన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఈదర గోపిచంద్ మాట్లాడుతూ దుష్టసాహిత్య దహనం నిరంతరం జరగాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు బషీరున్నీసా, అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యులు డాక్టర్ తక్కోలం మాచిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ తుమ్మలూరు సురేష్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

చేతిరాతను మెరుగుపరిచే మెలకువలు

పులివెందుల టౌన్, మార్చి 23: ఇంగ్లీష్, తెలుగు, హిందీ అంశాలలో చేతిరాతను మెరుగుపరిచేందుకు విద్యార్థులకు మెలకువలకు నేర్పించినట్లు నల్లపురెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు వై.కృష్ణవేణమ్మ తెలిపారు. ఆల్ ఇండియా హ్యాండ్ రైటింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మల్లేశ్వర్‌రెడ్డితో శిక్షణ ఇప్పించామన్నారు. మెలకువలతో ప్రాక్టీస్ చేస్తే కచ్చితంగా మంచి దస్తూరి వస్తుందని ఎలా ప్రాక్టీస్ చేయాలో విద్యార్థులకు విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

శివాలయంలో 28న సంప్రోక్షణ

వేంపల్లె, మార్చి 23: గండి క్షేత్రంలోని పాపాఘ్ని నది పడమర దిక్కున వెలసిన శివాలయంలో ఈనెల 28వ తేదీ నుంచి సంప్రోక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు యోగిరామానంద స్వామి చరణ సేవా ట్రస్టు నిర్వాహకులు సదాశివశర్మ, దండపాణి తెలిపారు. శనివారం శివాలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ట్రస్టు సభ్యులు శ్రీహరి స్వామి మాట్లాడుతూ 28న సంకల్పం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, 29న అమ్మవారి ఖడ్గమాల, చండీ సప్తశతి పారాయణం, 30న అగ్నిప్రతిష్ఠ, మహాగణపతి హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సేవా ట్రస్టు కార్యదర్శి కిరణ్‌కుమార్, సహాయ కార్యదర్శి కావలి హరినాథ్, సభ్యులు కావలి కృష్ణతేజ, సత్యనారాయణ, అపరాజిత పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రామకోటి మహాయజ్ఞం

చక్రాయపేట, మార్చి 23: నాగులగుట్టపల్లెలో వెలసిన శ్రీరాముని తల్లిదండ్రులైన దశరథ మహారాజు కౌసల్య, సుమిత్ర కైకేయి వెలసిన ప్రాంతంలో శనివారం భక్తిశ్రద్ధలతో రామకోటి మహాయజ్ఞం నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త రామసుబ్బయ్య, మాజీ సర్పంచు సుబ్బరామయ్య పేర్కొన్నారు. భద్రాచల భక్తరామదాసు వంశస్థులు ఈ ప్రాంతంలో రామకోటి మహాయజ్ఞం జరగాలని రామకోటి రాయిస్తున్నట్లు తెలిపారు.

నేడు బహుమతుల ప్రదానం

కడప (మారుతీనగర్), మార్చి 23: టైప్ రైటింగ్ పరీక్షలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఈనెల 24 ఉదయం 10 గంటలకు హరిత హోటల్‌లో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ఏపీ టైప్‌రైటింగ్, షార్ట్‌హ్యాండ్ ఇన్‌స్టిట్యూట్ అసోసియేషన్ (ఏపీటీఎస్‌ఐఏ) కడప జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శివకృష్ణ, నవీన్‌కుమార్ తెలిపారు. అనంతరం అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఉంటుందన్నారు. ఇందులో ఏపీలోని వివిధ జిల్లాల టైప్‌రైటింగ్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాళ్లు హాజరుకానున్నట్లు తెలిపారు.

వీల్‌చైర్స్ వితరణ



వీల్‌చైర్స్ అందిస్తున్న రామమునిరెడ్డి

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 23 : మాజీ ఎంపీ రామమునిరెడ్డి తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రెండు వీల్‌చైర్లను కడప సర్వజన ఆసుపత్రికి బహూకరించారు. ఈ కార్యక్రమంలో సర్వజన ఆసుపత్రికి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు, మాజీ ఎంపీ రామమునిరెడ్డి, రిమ్స్ సెక్యూరిటీ, శానిటేషన్ కాంట్రాక్టర్ బాలనారాయణరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు నేడు, రేపు కూడా చెల్లించవచ్చు

కడప (నాగరాజుపేట), మార్చి 23 :జిల్లా వ్యాప్తంగా విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యధావిధిగా పనిచేస్తాయని విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజనీరు ఎస్ రమణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు, రేపు సెలవులు అయినప్పటికీ ప్రజల అవసరాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. కావున ప్రజలు సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

లింగనిర్ధారణ చట్టరీత్యా నేరం

సీకేదిన్నె, మార్చి 23: లింగనిర్ధారణ చట్టరీత్యా నేరమని సీడీపీఓ రమాదేవి తెలిపారు. శనివారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలకు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భస్థ లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, వాటిని ప్రోత్సహించినా, చేయించుకున్నా శిక్షార్హులవుతారన్నారు. కార్యక్రమంలో లీగల్ ఆఫీసర్ సునీతారాజు, సూపర్‌వైజర్లు శ్రీదేవి, వెంకటలక్ష్మి, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ పొందినవారు ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకోవాలి

సీకేదిన్నె, మార్చి 23: శిక్షణ పొందిన యువత పుట్టగొడుగుల ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త శిల్పకళ తెలిపారు. పుట్టగొడుగుల పెంపకంలో భాగంగా శిక్షణ కార్యక్రమం రెండవ రోజు గ్రామీణ యువతకు పుట్టగొడుగుల పెంపకంపై క్షేత్రస్థాయిలో పుట్టగొడుగుల తయారీ విధానాన్ని చూపించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

కాగడాల ప్రదర్శన



కడప (నాగరాజుపేట), మార్చి 23 : దేశంలో పేట్రేగిపోతున్న కులమత రాజకీయాలను భగత్‌సింగ్ స్ఫూర్తితో ఓడించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర పిలుపునిచ్చారు. శనివారం ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో స్వాతంత్ర సమర యోధులు సర్దార్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుక్‌దేవ్‌ల 93వ వర్ధంతి సందర్భంగా జిల్లా పరిషత్ నుండి ఏడురోడ్లకూడలి వరకు కాగడాల ప్రదర్శన చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగాసురేష్, సీపీఐ జిల్లాకార్యవర్గ సభ్యులు వీరశేఖర్, సీపీఐ నాయకులు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ నేతలు





చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్న వేంపల్లె, చక్రాయపేట నాయకులు

వేంపల్లె, మార్చి 23: పులివెందుల నియోజకవర్గానికి చెందిన పలువురు వైసీపీ నేతలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరంతా శనివారం పులివెందుల టీడీపీ అభ్యర్థి బీటెక్ రవి వెంట వెళ్లి విజయవాడలో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో వేంపల్లె మండల వైసీపీ నేత ఎస్పీ జయరామిరెడ్డి, వార్డుమెంబర్ వెంకటేశ్, చక్రాయపేట మాజీ జడ్పీటీసీ సభ్యుడు రాధాకృష్ణతో పాటు పలువురు టీడీపీలో చేరారు.

మద్యంసీసాలు స్వాధీనం

కొండాపురం ,మార్చి 23: మండలంలోని లావనూరు గ్రామంలో 26 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.లావనూరు గ్రామానికి చెందిన చంద్రకళావతి అనే మహిళ మద్యం బాటిళ్లను అనుమతి లేకుండా విక్రయిస్తుండగా వాటిని స్వాధీనం చేసుకున్నారు.కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ యోగీంద్ర తెలిపారు.

నిలిచిపోయిన నీటి సరఫరా

● పంపింగ్‌హౌస్‌లో కాలిపోయిన ప్యానల్‌బోర్డు, మోటార్లు ● ఇబ్బందుల్లో ప్రజలు



పంపింగ్‌హౌస్‌లో నిలిచిపోయిన మోటార్లు, తొలగించిన పైపులు

జమ్మలమడుగు, మార్చి 23: జమ్మలమడుగు నియోజకవర్గంలోని మైలవరం జలాశయంలో గ్రామీణ ప్రాంతాలకు నీటి సరఫరా చేసే పంపింగ్‌హౌస్‌కు సరఫరా నిలిచిపోయింది. రెండు రోజుల నుంచి 11 గ్రామాలకు నీటి సరఫరా లేక ఆయాగ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్యానల్‌బోర్డు, మోటార్లు కాలిపోయి జలాశయంలో నుంచి నీరు పంపింగ్‌హౌస్‌కు సరఫరా చేయడంలేదు. దీంతో పంపింగ్‌హౌస్‌లో మోటార్ల ఇనుప పైపులు వేరుచేసి పెట్టారు. ప్రతిరోజు పంప్‌హౌస్‌లో రెండు మోటార్లు రన్నింగ్‌లో ఉండాల్సింది ఒక మోటారు ద్వారానే పంపింగ్ చేసేవారు. సీపీడబ్ల్యూఎస్ పథకం జమ్మలమడుగు నియోజకవర్గంలోని మైలవరం, పెద్దముడియం, జమ్మలమడుగు మండలాల్లోని సుమారు 24 గ్రామాలకుగాను 11 గ్రామాలకు మాత్రమే అరకొరగా నీరు అందిస్తున్నారు. గండికోట జలాశయం నుంచి ఇటీవల కొంతనీరు విడుదల చేయడంతో అది కూడా వారం రోజులకంటే ఎక్కువగా నీరు వచ్చే అవకాశం లేదని ప్రస్తుతం నీటి సమస్యలు ఏర్పడ్డాయి. కాగా మైలవరం సీపీడబ్ల్యూఎస్ పథకంలో పనిచేస్తున్న సిబ్బందికి చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్నారు. మైలవరం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుధీర్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా పంప్‌హౌస్‌లో రెండు రోజుల నుంచి మోటార్లు ,ప్యానెల్‌బోర్డు కాలిపోయి సమస్య ఉంది. జలాశయం వద్ద నుంచి నీటిశుద్ధి కేంద్రం వరకు నీటి సరఫరా నిలిచిపోయింది. మైలవరం పంప్‌హౌస్‌లో ఇనుపపైపులు వేరుచేసి పెట్టారు. మరమ్మతులు అయిన తర్వాత తిరిగి నీటి సరఫరా ఉంటుందన్నారు. ఎప్పుడు తయారు చేస్తారో కాంట్రాక్టర్ స్పందించాల్సి ఉందని ఏఈ తెలిపారు. అప్పటి వరకు ప్రజలకు నీటి సమస్య తప్పదు.

గుడిసెలు తొలగించడం అన్యాయం

బద్వేలు, మార్చి 23: గోపవరం మండలంలోని పీపీ కుంట వద్ద ప్రభుత్వ భూమిలో ఇళ్లులేని పేదలు గుడిసెలు వేసుకున్నారని, అయితే రెవెన్యూ , పోలీసు అధికారులు అర్ధరాత్రి వేళలో పేదల గుడిసెలు కూల్చేయడం సరికాదని సంఘమిత్ర రాష్ట్ర అధ్యక్షుడు సొద్దల పెంచలయ్య పేర్కొన్నారు. శనివారం పేదలతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ అధికారులు , ప్రజాప్రతినిధులు అర్హులైన పేదలకు ఇంటిపట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

తనిఖీలు నిష్పక్షపాతంగా చేయాలి

● శిక్షణ కార్యక్రమంలో ఆర్వో శ్రీనివాసులు, డీఎస్పీ యశ్వంత్



శిక్షణ ఇస్తున్న భాస్కర్

జమ్మలమడుగు, మార్చి 23: జమ్మలమడుగు నియోజకవర్గంలో ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో తనిఖీలు నిష్పక్షపాతంగా చేయాలని జమ్మలమడుగు నియోజకవర్గ ఆర్వో శ్రీనివాసులు సూచించారు. శనివారం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ చాంబర్‌లో నియోజకవర్గంలోని పోలీసు అధికారులు, తహసీల్దార్లు, స్పెషల్‌స్క్వాడ్ తదితర ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో శిక్షకుడు భాస్కర్ సూచనలు ఇచ్చారు. జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం సంబంధించి జమ్మలమడుగు ప్రాంతంలో వాహనాలకు డీజిల్ ఏర్పాటు, కొండాపురం, ముద్దనూరు, ఎర్రగుంట్లకు సంబంధించి ఎర్రగుంట్లలో వాహనాలకు సంబంధించి డీజిల్ ఏర్పాట్లు చేసినట్లు అధికారులకు శిక్షణ కార్యక్రమంలో తెలియజేశారు.

వైసీపీ పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి సుబ్రహ్మణ్యం(బాబు) రాజీనామా

ప్రొద్దుటూరు ,మార్చి 23 : ప్రొద్దుటూరు వైసీపీ పట్టణ అధ్యక్షుడుగా వున్న మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ హౌస్‌బిల్డింగ్ సొసైటీ మాజీ చైర్మెన్ కామిశెట్టి సుబ్రహ్మణ్యం అలియాస్‌బాబు ఆ పార్టీ సభ్యత్వానికి అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఆ మేరకు శనివారం కడపలోని జిల్లా వైసీపీ అధ్యక్షుడు సురేష్ బాబుకు రాజీనామా పత్రాన్ని అందజేశారు. వ్యక్తి గత కారణాలతో రాజీ నామా చేసినట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై దృష్టి పెట్టండి:ఆర్డీవో



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

కాశినాయన మార్చి23: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై సిబ్బంది ప్రత్యేక దృష్టిపెట్టాలని బద్వేల్ ఆర్డీవో ఆకుల వెంకటరమణ పేర్కొన్నారు. శనివారం మండలంలోని 27 పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా కరెంట్, తాగునీరు,మరుగుదొడ్లు తదితర సదుపాయాలు ఏమేరకు ఉన్నాయే పరిశీలించారు. ఈయన వెంట తహసీల్దారు కృష్ణ, ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి,డీటీ ప్రసన్న లక్ష్మీ, సెక్టోరియల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలి



టీడీపీ వర్క్‌షాప్‌నకు హాజరైన భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, మార్చి 23: జమ్మలమడుగు నియోజకవర్గంలో టీడీపీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని ఆ పార్టీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి సూచించారు. శనివారం విజయవాడలో జరిగిన టీడీపీ వర్క్‌షాప్‌నకు జిల్లా నుంచి పలువురు నేతలు హాజరైనట్లు అందులో భాగంగా అధిష్ఠానం పిలుపుమేరకు వర్క్‌షాప్‌నకు ఆయన వెళ్లినట్లు తెలిపారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు, ఎంపీ అభ్యర్థులు ఇన్‌చార్జీలను పిలిచి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జంబాపురం రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఎన్నికల వ్యూహం వర్క్‌షాపునకు హాజరైన వరద



వర్క్ షాపులో వరద, పుట్టా

ప్రొద్దుటూరు , మార్చి 23 : రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై విజయవాడలో శనివారం రాష్ట్ర స్థాయి వర్క్‌షాపు జరిగింది. ఈ వర్క్‌షాపులో నారాచంద్రబాబు ప్రధానంగా అభ్యర్థులందరికీ దిశానిర్దేశం చేశారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంనుంచి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి,నంద్యాల కొండారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మెన్ ఆసం రఘురామిరెడ్డి, టీడీపీ పట్టణ ఘంటశాల వెంకటేశ్వర్లు, బచ్చల పుల్లయ్య పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో టీడీపీ జెండా ఎగురవేయాలి



మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

ప్రొద్దుటూరు ,మార్చి 23 : ప్రొద్దుటూరులో టీడీపీ జెండా ఎగువవేయడానికి అందరూ కలిసి పని చేయాలని పార్టీ ప్రకటించిన అభ్యర్థి వరదరాజులరెడ్డిని గెలిపించుకోవాలని నారా చంద్రబాబు ప్రొద్దుటూరు టీడీపీనేతలు సీఎం సురేష్ నాయుడు, ముక్తియార్‌లకు సూచించారు. శనివారం విజయవాడలో సీఎం సురేశ్ నాయుడు, ముక్తియార్‌లు చంద్రబాబునాయుడును కలిశారు. ప్రొద్దుటూరులో పార్టీ పరిణామాలపై చర్చించారు. ఈ సందర్భంగా సురేశ్ నాయుడు మాట్లాడుతూ తనకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

రాయలసీమకు కేటాయించిన నీటివాటాను విడుదల చేయాలి

రాయలసీమ రాష్ట్ర సమితి రాష్ట్ర అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 23: వేసవి రాకముందే రాయలసీమ జిల్లాల్లో తీవ్ర నీటి కొరత ఏర్పడిందని ఈ నీటికొరతను అధిగమించడానికి సీమకు కేటాయించిన నీటి వాటాను విడుదల చేయాలని రాయలసీమ రాష్ట్ర సమితి రాష్ట్ర అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీటి ఎద్దడితో ప్రజలు మైళ్ల దూరం వెళుతున్నారని, రైతులు కూడా పంటలు సాగుచేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. రాయలసీమకు 135 టీఎంసీలు కేటాయించగా 113 టీఎంసీల నీరు మాత్రమే విడుదల చేస్తున్నారన్నారు. సీమ ప్రాంతంలో నీటి కొరతను అధిగమించడానికి కృష్ణ, తుంగభద్ర, పెన్నా నదుల అనుసంధానం చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల కోడ్ అతిక్రమిస్తే కేసు నమోదు : సీఐ

పోరుమామిళ్ల, మార్చి 23 : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అతిక్రమిస్తే కేసు నమోదు చేస్తామని సీఐ చిరంజీవి అన్నారు. శనివారం పోరుమామిళ్ల పోలీసుస్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు చెందిన జెండాలు, ఫ్లెక్సీలు, స్టిక్కర్లు, గోడ మీద రాతలు ఉండరాదన్నారు. ఎవరైనా అభిమానులు, పార్టీ నాయకులు, అభ్యర్థుల పేర్లుకానీ తమ ఇంటిపై జెండా పెట్టుకోవాలంటే ఆర్‌వో వద్ద అనుమతి తీసుకోవా లన్నారు. వివాహాలకు, ఫంక్షన్లకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. ఏ వ్యక్తి అయినా 50వేలరూపాయల కన్నా ఎక్కువ డబ్బు ఉంచుకుంటే సీజ్ చేస్తామన్నారు. ఎన్నికల ప్రచార వాహనాల్లో ఎన్నికల సామగ్రికి సంబంధించి ఆర్వో అనుమతి తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎన్నికల ప్రచారంలో పార్టీల తరపున ప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు కానీ పాల్గొంటే వారిపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. వివాహాలకు సంబంధించి మహిళలు 500 గ్రాముల వరకు బంగారు నగలు ధరించ వచ్చున్నారు.పెళ్లి కాని మహిళలు 250 గ్రాములు మాత్రమే ధరించవచ్చని అన్నారు. పోలీసుస్టేషన్లలో ప్రార్థనాస్థలాలు, దేవాలయాలకు చర్చిలకు వందగజాల దూరంలోప్రచారాలు నిర్వహించు కోవాలన్నారు. మైకులు, పటాకులు కాల్చడం చేయరాదన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నంత వరకు ఈ నిబంధనలు వర్తిస్తాయన్నారు. వ్యక్తులు, టీషర్టులు, బైకులపై స్టిక్కర్లు ఉన్న స్లోగన్స్ ఉన్నా కేసు నమోదు చేస్తామన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలి

బ్రహ్మంగారిమఠం, మార్చి 23 : ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలని బ్రహ్మంగారిమఠం ఎస్‌ఐ విద్యాసాగర్ తెలిపారు. శనివారం బి.మఠం ఐదురోడ్ల కూడలిలో ప్రజలు, నాయకులతో మాట్లాడారు. అలాగే గ్రామాల్లో ఎటువంటి గొడవలు జరగకుండా ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించుకోవాలని ఆయన తెలిపారు. ఎటువంటి చిన్న సంఘటనలు జరిగినా కూడా పోలీసు వారికి ఫిర్యాదు చేయాలని ఎస్‌ఐ తెలిపారు.

చిన్నచిన్న సమస్యలను గ్రామాల్లోనే పరిష్కరించుకోవాలి



మాట్లాడుతున్న సివిల్ జడ్జి భార్గవి

కొండాపురం, మార్చి 23 చిన్న చిన్న సమస్యలను గ్రామాల్లోనే పెద్ద మనుషుల సమక్షంలో పరిష్కరించుకోవాలని జమ్మలమడుగు సివిల్ జడ్జి భార్గవి తెలిపారు.మండలంలోని చెన్నమనేని పల్లె గ్రామంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కేసుల గురించి వివరించారు.కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ వంటి వాటిని వినియోగించుకోవాలని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరమ్మ, సీఐ వేణుగోపాల్,కొండాపురం ఎస్‌ఐ యోగీంద్ర పాల్గొన్నారు.

చట్టాల గురించి అందరూ తెలుసుకోవాలి

చాపాడు, మార్చి 23: చట్టాలను గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని మైదుకూరు సివిల్‌కోర్టు జడ్జి ఖాజామైనుద్దీన్ అన్నారు. ఫుల్లారెడ్డినగర్ గ్రామంలో శనివారం సాయంత్రం జ్ఞానవిజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు ఎలాంటి ఘర్షణలకు పాల్పకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. సివిల్, క్రిమినల్ చట్టాల గురించి ఆయన ప్రజలకు వివరించారు. తహసీల్దారు భూషణం, ఎంపీడీవో మహబూబ్‌బీ, ఎస్‌ఐ కొండారెడ్డి, బాలర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నారాయణరెడ్డి, ప్రభుత్వ అసిస్టెంట్ ఫ్లీడర్ జ్వాలా శర్మ, న్యాయవాదులు శివరామరాజు, నాగిరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

భ్రూణ హత్యలు నివారించాలి

పోరుమామిళ్ల, మార్చి 23 : భ్రూణహత్యలు నివారించాలని సీడీపీవో లక్ష్మీదేవి, ప్రొటెక్షన్ ఆఫీసరు క్రిష్ణ అన్నారు. శనివారం పోరుమామిళ్లలోని ఐసీడీఎస్ కార్యాలయంలో బేటి బచావో, బేటి పఢావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజరు మాధవి, విజయకుమారి, చంద్రకళ మాట్లాడారు. పోషణ అభియాన్, సంపూర్ణపోషణ, ఆయుష్మాన్‌భారత్ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండాపురం..: ఆడపిల్లల జననాన్ని ప్రోత్సహించాలని జిల్లా బాలల పరిరక్షణ కౌన్సిలర్ మహేష్ తెలిపారు.శనివారం మండలంలోని గండ్లూరు కమ్యూనిటీ హాల్‌లో అంగన్‌వాడీ వర్కర్లకు బేటీ బచావో, బేటి పఢావో కార్యక్రమం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భారతి, అంగనవాడీ వర్కర్లు జ్యోతి,తారాదేవి,పద్మ,రామతులసి తదితరులు పాల్గొన్నారు.

ఖాజీపేట..: బాల్యవివాహాలు అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మైదుకూరు సీడీపీవో శ్రీదేవి, ఐసీపీఎస్ విజయకుమారి అన్నారు. శనివారం ఖాజీపేట అగ్రహారం అంగన్వాడీ కేంద్రంలో బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమంపై అంగన్వాడీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పి.భారతి, జె.శ్రీదేవి, ఎ.రమాదేవి, జహరాబీ, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

చాపాడు..: ప్రతి ఇంటిలోని ఆడపిల్లలకు చదువు ముఖ్యమని ఐసీడీఎస్ సీడీపీవో సావిత్రి అన్నారు. చాపాడులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో శనివారం బేటీ బచావో, బేటీ పఢావోపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లల మనుగడకు అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు.కార్యక్రమంలో జిల్లా బాలల ప్రొటెక్షన్ అధికారి సునీత, సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మి, సుబ్బరత్న, వరలక్ష్మి, ప్రత్యూష, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘన కేసు నమోదు

ప్రొద్దుటూరు , మార్చి 23 : మండల పరిధిలోని దొరసానిపల్లెలోని రజక కాలనీలో ఎన్నికల కోడ్ వున్నా కాలువ నిర్మాణ పనులు ప్రారంభించినందుకు ఎన్నికల కోడ్ ఫ్లయింగ్ స్క్వాడ్ టీం అరుణకుమారి ఆధ్వర్యం పరిశీలించారు. విచారించి కోడ్ ఉల్లంఘనకు పాల్పడినట్లు నిర్ధారించి రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

ఓటుహక్కు వినియోగంపై ర్యాలీ

పోరుమామిళ్ల, మార్చి 23 : మన ఓటు మన హక్కు, ఓటు భవిష్యత్తు అని ఓటుకు నోటు అసలే వద్దని తహసీల్దారు శిరీషా అన్నారు.శనివారం పోరుమామిళ్లలో ఆమె ఆధ్వర్యంలో ఎస్వీఈఈపీ యాక్టివ్ కార్యక్రమంలో భాగంగా తహసీల్దారు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండు వద్ద మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రేపు గౌరపౌర్ణమి వేడుకలు

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 23: గౌరపౌర్ణమి వేడుకలను 25వ తేదీ అనిబిసెంట్ మున్సిపల్ హౌస్కూలు మైదానంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ నిర్వాహకులు తెలిపారు. సోమవారం సాయంత్రం అయిదు గంటలకు శ్రీకృష్ణ, బలరాముల విగ్రహాలకు ప్రత్యేక పూజలు, భజన, కీర్తన, హారతి, ఏడు గంటలకు మహాకుంభాభిషేకం, మహాపుష్పాభిషేకం నిర్వహిస్తామన్నారు. 7.45 గంటలకు భగవద్గీత ప్రవచనాలు, 8.15 మహాహారతి ఉంటుందని తెలిపారు. సాయంత్రం 5.30 గంటల నుంచి 30 వేల మంది భక్తులకు అన్నప్రసాద వినియోగం చేస్తామన్నారు.

సెలవుల్లోనూ విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

పోరుమామిళ్ల, మార్చి 23: విద్యుత్ వినియోగదారులు ఆది, సోమవారాల్లో కూడా కరెంటు బిల్లులు చెల్లించవచ్చని ఏఈ వెంకటమహేశ్ తెలిపారు. పోరుమామిళ్ల, బి.కోడూరు, కలసపాడు, కాశినాయన మండలాల్లో, ఆదివారం కూడా బిల్లు కార్యాలయాలు తెరిచి ఉంచుతామన్నారు.

కాశినాయన..: సెలవు దినాలైనా ఆదివారం, సోమవారాల్లో(హోలీ) కరెంట్ బిల్లుల వసూలు కేంద్రాలు పనిచేస్తాయని ట్రాన్స్‌కో ఏడీ చిన్నస్వామి నా యక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాశి నాయన, కలసపాడు,పోరుమామిళ్ళబీకోడూరు మండలాల కరెంట్ వినియోగదారులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గోపవరం..: విద్యుత్ వినియోగదారులు తమ పాత బకాయిలు ఆదివారం, సోమవారం సెలవు రోజుల్లో కూడా కట్టవచ్చని విద్యుత్‌శాఖ అధికారి చెన్నయ్య పేర్కొన్నారు. గోపవరం, బద్వేలు, అట్లూరు,బి.మఠం మండలాల కలెక్షన్స్ కౌంటర్స్ తెరిచి ఉంటాయన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

బద్వేలు రూరల్, మార్చి 23 : స్థానిక సిద్దవటం రోడ్డులోని మా ఫిజియోథెరపి హాస్పిటల్‌లో ఆదివారం కడపకు చెందిన లీలావతి ఆర్థోకేర్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరం సద్వినియోగం చేసుకోవాలని ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ మహబూబ్‌పీరా శనివారం ఒక ప్రకటనలో కోరారు. సిద్దవటం రోడ్డులోని సీఎస్‌ఐ చర్చి ఎదురుగా ఉన్న హాస్పిటల్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు ఉచిత వైద్యశిబిరం ఉంటుందన్నారు. ఆర్థో సమస్యలు ఉన్నవారు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇద్దరు జేబు దొంగలు అరెస్టు

పోరుమామిళ్ల, మార్చి 23 : జేబు దొంగతనానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. పోరుమామిళ్ల టౌన్‌లోని బెస్తవీధిలో ముగ్గురు వ్యక్తుల వద్ద నెల్లూరు జిల్లా బోగోల్ మండలానికి చెందిన తిమ్మసముద్రం తిప్పకాలనీకి చెందిన బచ్చు రాము, పసుపులేటి శేఖర్‌ను పోరుమామిళ్ల బస్టాండు వద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.30వేలు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.